క్లుప్తంగా

నేడు వీఎంఎఫ్ ప్రవేశ పరీక్ష

తొర్రూరు: ఉమ్మడి జిల్లా పరిధిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 50రోజుల ఉచిత శిక్షణ శిబిరం కోసం నేడు (శనివారం) అర్హత పరీక్ష నిర్వహిస్తున్నట్లు వీఎంఎఫ్ డైరెక్టర్ తక్కెళ్ల పల్లి రవీంద్ర తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తొర్రూరు, హన్మకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు, పరకాల, వర్ధన్నపేట, పాలకుర్తి, జనగాం, మహబూబాబాద్, నర్సంపేట, ఏటూరునాగారం, మరిపెడ ప్రాంతాల్లో శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హత పరీక్షలో పాల్గొనేందుకు అర్హులన్నారు. అర్హత సాధించిన విద్యార్థులకు ఈనెల 8నుంచి తొర్రూరులోని వందేమాతరం ఫౌండేషన్‌లో 50రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 99630 44630, 94921 48158 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీఓ విడుదలపై హర్షం

మహబూబాబాద్: జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలతోపాటు మానుకోట మున్సిపాలిటీకి రూ.50కోట్లు మిగిలిన మూడు మున్సిపాలిటీలకు రూ.25కోట్ల చొప్పున ప్రకటించిన విషయం విధితమే. ఆ నిధులకు సంబంధించిన జీఓ ఈనెల 3న సీఎం విడుదల చేసినట్లు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తెలిపారు. జీఓ విడుదల పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ప్రతి జీపీకి రూ.10లక్షల చొప్పున మంజూరు చేస్తూ జీఓను విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

మండల సభ వాయిదా

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదాపడింది. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీపీ భూక్య మౌనిక అధ్యక్షతన మధ్యాహ్నం ఒంటి గంటకు మండల సభ ప్రారంభం ఉండగా పన్నెండు మంది ఎంపీటీసీ సభ్యులు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదు. దీంతో మండల సభ వాయిదా వేశారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో బొడ్రాయి పండుగ ఉన్నందువల్ల ఎంపీటీసీ సభ్యులు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదని చెప్పారు.

పైపులైన్లకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డు, శాంతినగర్‌లో శుక్రవారం మున్సిపాలిటీ సిబ్బంది తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ల మరమ్మతు పనులను చేపట్టారు. బైపాస్ రోడ్డు, శాంతినగర్‌తో పాటు పలుప్రాంతాల్లో తాగునీటిని సరఫరా చేసే పైపులు పగిలి నీరు వృథా అవుతుండడంపై సాక్షిలో కథనాలు ప్రచురితం కావడంపై స్పందించిన మున్సిపాలిటీ సిబ్బంది శాంతినగర్‌తో పాటు బైపాస్ రోడ్డులో పగిలిన పైపులకు మరమ్మతు పనులు చేపట్టారు.

ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

తొర్రూరు: దుకాణదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సింగారపు కుమార్ తెలిపారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని దుకాణ సముదాయాలను కమిషనర్ సందర్శించారు. దుకాణాల నిర్వాహకులకు సూచనలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. వ్యాపారాల నిర్వహణకు మున్సిపల్ చట్టం ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, సంబంధిత ఫీజులను మీసేవా కేంద్రంలో చెల్లించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ రాజు, జూనియర్ అసిస్టెంట్ శ్రావణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ పాల్గొన్నారు.

చీరల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో జరుగుతున్న బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనలో భాగంగా 35వ వార్డు పరిధిలోని ప్రజలు 500 మందికి స్థానిక వార్డు కౌన్సిలర్ గద్దె నీరజారాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గద్దె రవి శుక్రవారం పట్టు చీరలను, పురుషులకు పట్టు పంచాలు, షర్టులు పంపిణీ చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఇస్లావత్ తండా (ఎం) గ్రామ పంచాయతీ పరిధిలోని తేజావత్ తండాలో తేజావత్ ఆశ్య అనే రైతు పొలంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. మూడు మెయిన్ విద్యుత్ తీగలు భూమికి తగులుతూ కిందకు వేలాడుతున్నాయి. పొలం దున్నడానికి కూడా వీలుగా లేదని సదరు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి ఆ స్థలంలో కొత్త విద్యుత్ స్తంభం మంజూరు చేయాలని కోరుతున్నాడు.

అమ్మవార్లకు మొక్కుల చెల్లింపు

గూడూరు: మండలంలోని దామరవంచ సమీప అటవీ ప్రాంతంలోని జాతీయ రహదారి పక్కన చింతలగట్టు వట్టివాగు ఒడ్డున వెలసిన శ్రీ సమ్మక్క సారలమ్మ మినీ జాతర ప్రదేశం భక్తజనసంద్రమైంది. మూడో రోజు శుక్రవారం ఉదయం జాతర కమిటీ నిర్వాహకులు, పూజారులు సంప్రదాయ పద్ధతిలో డోలు మంగళవాయిద్యాల నడుమ అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేసి పసిరిక బోనాలు సమర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గుగులోతు సుచిత్ర బోనం ఎత్తుకొని మొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పెనక నాగయ్య, ఈసం సహదేవులు, పూనెం వీరస్వామి, ప్రధాన పూజారి దారం సిద్దు, కారం లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కంబాలపల్లిలో..

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో నందిమేడారం-కంబాలపల్లి సమ్మక్క సారలమ్మ జాతర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తల్లులను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంద ఈరన్న, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, తేళ్ల శ్రీనివాస్, లూనావత్ అశోక్, మందుల రఘు, చిట్యాల జనార్దన్, ఆకుల హరిప్రసాద్, కర్పూరపు పాల్గొన్నారు. అమ్మల భక్తుడు తూర్పాటి గణేష్ ఆధ్వర్యంలో నందిమేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయ నిర్మాణం, జాతర ఏర్పాట్లు చేశారు.



గూడూరు: బోనం ఎత్తిన జెడ్పీటీసీ సభ్యురాలు సుచిత్ర, భక్తులు



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో తల్లులకు మొక్కుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్



గూడూరు: భక్తుల సందడి

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి

బయ్యారం: రెండోవిడత గొర్రెల పంపిణీని వెంటనే ప్రారంభించి నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమచేయాలని కోరుతూ శుక్రవారం గొర్రెల మేకల పెంపకదారుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షులు దూదిమెట్ల మోహన్‌రావు మాట్లాడుతూ... గొర్రెల పంపిణీని నిర్వహించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం తగదన్నారు. అనంతరం డీటీకి వినతిపత్రంను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, అమర్‌నాథ్, కేతమల్లు, వీరన్న, మల్లయ్య, రాజు, లచ్చయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత గొర్రెలను వెంటనే పంపిణీ చేయాలంటూ కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో గల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట శుక్రవారం గొర్రెల మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామక్రిష్ణ, మహేష్, చిన్నాల కట్టమల్లు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



బయ్యారం: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగిని సస్పెండ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా ట్రైబల్ గురుకులాల ఆర్‌సీఓ కార్యాలయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఓట్‌సోర్సింగ్ ఉద్యోగిని బదిలీ చేయడం కాదని వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మానుకోట జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం మాట్లాడుతూ.. జిల్లాను గిరిజన గురుకుల విద్యాలయాల అక్రమ పోస్టులు నిర్వహించారని, జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను వెలికితీసేందుకు ధర్నాలు చేశామని, ఈక్రమంలో కేవలం అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం సమజసం కాదని, అవినీతికి పాల్పడిని ఉద్యోగితోపాటు ఆర్‌సీఓను కూడా సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో దశలవారీగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి బాధ్యులైన ఆర్‌సీఓపై చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన గురుకులా విద్యాలయలో విద్యార్థులకు నాణ్యమై పౌషిక ఆహారం అందించాలని, మెరుగైన వసతులు కల్పించాలన్నారు.

బెంచీల వితరణ

డోర్నకల్: మండలంలోని చిలుకోడు జెడ్పీహెచ్‌ఎస్‌కు ఖమ్మంకు చెందిన హరి స్వీట్స్ యజమాని కోనకంచి హరిబాబు, లక్ష్మీకుమారి దంపతులు గురువారం పాఠశాలకు రూ.45వేల విలువైన పది బెంచీలను బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మ, సర్పంచ్ రాయల వెంకట్ బాబు, నరేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘గెలిపించడమే నా ఎజెండా’



క్యాంపు కార్యాలయం ప్రారంభిస్తున్న పొంగులేటి

గార్ల: తనను నమ్ముకొని తన వెంట వచ్చి తన తరఫున ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న వారిని గెలిపించడమే నా ఎజెండా అని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం గార్ల మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. గార్ల నెహ్రూసెంటర్‌లో జిల్లాలో తొలిసారి పొంగులేటి కోరం క్యాంపు కార్యాలయంను ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. త్వరలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, మున్సిపాలిటీలు, పట్టణాల్లో పొంగులేటి క్యాంపు కార్యాలయాలను త్వరలోనే ప్రారంభించుకుంటామని పేర్కొన్నారు. తనను నమ్ముకొని తన వెంట వచ్చిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఎవరూ అధైర్య పడవద్దని, రానున్న ఎన్నికల్లో వీరిని గెలిపించే బాధ్యత తనదేనని వారికి భరోసా ఇచ్చారు. తొలుత మర్రిగూడెం గ్రామంలోని వేట వెంకటేశ్వరస్వామి దేవాలయంను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పలు బాధిత కుటుంబాలకు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, తూళ్లూరి బ్రహ్మయ్య, మేకల మల్లిబాబు యాదవ్, గుండా వెంకట్‌రెడ్డి, సామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎం శివాజీచౌహాన్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, మార్కెట్ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు నిజం చేయండి



స్టడీ మెటీరియల్స్‌ను అందజేస్తున్న ఉషాదయాకర్‌రావు

పెద్దవంగర: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతులుగా ఎదిగి కన్నవారి కలలను నిజం చేయాలని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని పదో తరగతి చదువుతున్న 36మంది విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరియల్స్‌ను ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఉషాదయాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి, నాయకులు ఈదురు ఐలయ్య, కేతిరెడ్డి సోమనర్సింహారెడ్డి, శ్రీరాం సుధీర్, ఎంపీటీసీ శ్రీనివాస్, బొమ్మకల్లు సర్పంచ్ కేతిరెడ్డి దీపికరెడ్డి, ఉప సర్పంచ్ రాము, ఈడీఆర్ ట్రస్టు కోఆర్డినేటర్ కల్పన, ఎండీ జలీల్, ఎస్‌ఓ స్రవంతి, జెడ్పీ హెచ్‌ఎం విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని ఖాళీ చేయించే హక్కు లేదు

కొత్తగూడ: ఆదివాసీ గ్రామాన్ని ఖాళీ చేయించే హక్కు ఎవరికి లేదని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరు మండలం దొరవారితిమ్మాపురం గ్రామాన్ని కాళీ చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా అడవినే నమ్ముకుని తిమ్మాపురం గ్రామస్తులు నివసిస్తున్నారని అన్నారు. వారికి వసతులు కల్పించడంలో విఫలమైన పాలకులు గ్రామాన్నే ఖాళీ చేయాలని అనడం ఎంతవరకు సమంజసం అన్నారు. గ్రామాన్ని కాళీ చేసే విషయంలో రాజకీయ నాయకులు మాట్లాడాలని కోరారు. ఈసమావేశంలో బూర్క వెంకటయ్య, నర్సక్క, సోమయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయిలయ్య

కొనసాగుతున్న ‘కంటివెలుగు’ శిబిరం



మరిపెడ రూరల్: ఉల్లెపల్లి కంటివెలుగులో అద్దాలు పెడుతున్న చైర్మన్ నవీన్

మరిపెడ రూరల్: ప్రజా సంక్షేమ పథకాలు అమలులో తెలంగాణ రాష్ట్రమే దేశంలో నంబర్‌వన్ స్థానం నిలిచిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ అన్నారు. మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెండో విడత కంటి వెలుగు వైద్యశిబిరాన్ని శుక్రవారం చైర్మన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిర్రబోయిన ప్రభాకర్, ఎంపీటీసీ భూక్య జ్యోతి, కార్యదర్శులు మధుకర్, అశోక్, యామినీ, హెచ్‌ఈఓ కృష్ణ పాల్గొన్నారు. మండలంలోని గుండెపుడిలో మరిపెడ ఎంపీపీ గుగులోతు అరుణ కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ నూకల కిషన్‌రెడ్డి, ఎంపీడీఓ ధన్‌సింగ్, పాల్గొన్నారు.

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం కంటి వైద్య శిబిరం కొనసాగింది. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది వివరాల నమోదుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రవీణ్, కరుణాకర్, ఏఎన్‌ఎంలు నర్సుబాయి, శ్యామల, ఆశలు అనిత, జ్యోతి తదితరులు ఉన్నారు.

షర్మిల పాదయాత్రలో రాములునాయక్



మహబూబాబాద్ రూరల్: వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నెక్కొండలో కొనసాగుతుండగా ఆ యాత్రకు మద్దతుగా వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోతు రాములునాయక్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్: తపాలా శాఖ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మానుకోట సబ్ డివిజన్ తపాలా కార్యాలయం అసిస్టెంట్ సూపరింటెండెంట్ సైదానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం మహిళల భవిష్యత్ కోసం మహిళా బచత్ సమ్మాన్ యోజన స్కీంను కేంద్రం ప్రవేశపెట్టిందన్నారు.

విద్యుత్ కోతలు వెంటనే ఎత్తివేయాలి

గార్ల: వ్యవసాయ రంగానికి సరఫరా చేసే ఉచిత విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్ ఆరోపించారు. శుక్రవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని పత్రికల్లో గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబాబాద్: మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రమణ, విజయ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దవంగర: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన గిలకత్తుల కిరణ్, రెడ్డిమల్లు ప్రభాకర్‌లు మండలంలోని పలు గ్రామాలతో పాటు మండల కేంద్రానికి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా శుక్రవారం పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి బైండోవర్ చేశారు. మండలంలో ఎవరైన అనుమతులు లేకుండా ఇసుకను తరలించినట్లు అయితే తగు చర్యలు ఉంటాయని ఎస్సై ఎస్కే రియాజ్ పాషా తెలిపారు.

బ్యాక్‌లాక్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని మైనార్టీ బాలుర, బాలిక పాఠశాల, కళాశాల 2023–24 విద్యా సంవత్సరానికి 5వతరగతి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి, 6,7,8వ తరగతిలో ఉన్న బ్యాక్‌లాక్ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయకర్త శ్రీపాల అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎంసెట్ పుస్తకాలను సమన్వయకర్త శ్రీపాల, కళాశాల బృందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీపాల మాట్లాడుతూ.. ముస్లిం విద్యార్థులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు కూడా అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈనెల 15వ తేదీ వరకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, గ్రామస్థాయి విద్యార్థులకు ఆదాయం రూ. 1.50వేలు, పట్టణ విద్యార్థులకు రూ.2లక్షలు ఆదాయం ఉండాలన్నారు. వివరాలకు మైనార్టీ పాఠశాల, కళాశాలను సంప్రందించాలని, త్వరలోనే కళాశాల విద్యార్థులకు హైదరాబాద్‌లో ఎంసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఇమాముద్దీన్, వజిలెన్స్ అధికారులు మక్బుల్ పాషా, అమ్జాద్ అలీ, జిల్లా అకాడమీ కోఆర్డినేటర్ రోహిణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శ్రీపాల, తదితరులు

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ధర్నా

కేసముద్రం: అసంఘటిత కార్మికులందరికి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీటీ సాంబశివుడికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగయ్య, రాజేష్, వీరమ్మ, సారయ్య, కుమార్, సురేష్, వెంకటయ్య, దేవి తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్: అర్హులైన వారందరికి ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ స్వాతిబిందుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బడేటి సైదులు, దివ్య, ధనలక్ష్మి, మరియా, సలీమా, హసీనా, హాలీమా పాల్గొన్నారు.

మహబూబాబాద్: ఇల్లు లేని అసంఘటిత కార్మికులందరికీ డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.రాజమౌళి, కె.నాగన్న డిమాండ్ చేశారు. సంఘం జిల్లా మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వెంకటేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



కేసముద్రం: ధర్నా చేస్తున్న కార్మికులు

మోడల్ స్కూల్ హాస్టల్‌లో వర్కర్ల వివాదం

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలోని మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌లో విధులు నిర్వర్తిస్తున్న వర్కర్లు తరుచూ వివాదాలకు పాల్పడడంతో విద్యార్థినులకు భోజనం లేక పస్తుండే పరిస్థితి శుక్రవారం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న ఎంపీఓ గౌస్ హాస్టల్‌ను తనిఖీ చేసి హాస్టల్ నిర్వహణపై విచారణ చేశారు. ప్రధానంగా ఎస్‌ఓ, వార్డెన్, వాచ్‌మెన్ తరచూ తమను వేధింపులకు గురి చేస్తున్నారని, గతంలో డీఈఓకు ఫిర్యాదు కుడా చేశామని హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ తనిఖీకి వచ్చిన ఎంపీఓకు వివరించారు. హాస్టల్ వర్కర్ల వివాదంతో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందక కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈసందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ మోడల్ స్కూల్‌లోని హాస్టల్‌లో విధులు చేపట్టిన వార్డెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మన్ మధ్య అనేక నెలలుగా గొడవ జరుగుతుందన్నారు. ఉన్నతస్థాయి అధికారులకు సైతం ఫిర్యాదు చేసుకున్నారని, అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చిన వారిలో మార్పు లేదన్నారు. ఇరువురి ఫిర్యాదులపై విచారణ చేసి ఉన్నతస్థాయి అధికారులకు నివేదికను అందించనున్నట్లు పేర్కొన్నారు.



గుర్తూరు మోడల్ స్కూల్ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీఓ గౌస్

సంక్షిప్త సమాచారం

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

నెహ్రూసెంటర్: దళిత జర్నలిస్టులు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను దళిత జర్నలిస్టులకు వర్తింపజేయాలని అంబేడ్కర్ ఆశయ సాధన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుతు కొత్తపల్లి కిషోర్‌కుమార్ శుక్రవారం అన్నారు. ఈసమావేశంలో మందుల మహేందర్, బానోత్ లక్ష్మణ్, దేవులపల్లి ప్రవీణ్, నాసర్ల లింగన్న, అనంతుల నవీన్, వెంకన్న పాల్గొన్నారు.

రవిచంద్రను కలిసిన చిత్ర బృందం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేటలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్రను ‘ఓ దేవలింగా’ చిత్ర బృందం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చిత్రబృందం సభ్యులను రవిచంద్ర శాలువా కప్పి సన్మానించాడు. పాటకు సంబంధించిన వాల్ పోస్టర్, పాటను విడుదల చేశారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

దంతాలపల్లి: మండల కేంద్రంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీటీం పోలీసుల ఆధ్వర్యంలో భరోసా కార్యక్రమం నిర్వహించారు. షీటీం మహబూబాబాద్ ఇన్‌చార్జ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గుండ్రాతి మోహన్ మాట్లాడుతూ.. బాలికలను ఎవరైన వేధిస్తున్నట్లయితే 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సునంద, జగదీష్, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

దంతాలపల్లి: మండలకేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంఘం క్యాలెండర్ శుక్రవారం ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు గండి వెంకటనారాయణ మాట్లాడుతూ.. గీతకార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించాలన్నారు. రామన్న, అంతయ్య, లింగయ్య, ఎంపీటీసీ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

తీర్మానం చేయాలి

బయ్యారం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అటవీ సంరక్షణ నియమాల చట్టంను ఉపసంహరించాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని అటవీహక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో పరిరక్షణ కమిటీ నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, మండా రాజన్న మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు సూర్యం, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి మృతి

గార్ల: గార్లకు చెందిన భవన నిర్మాణ రంగ కార్మికుడు కుంట ఉపేందర్(40) శుక్రవారం తన స్వగృహంలో మృతి చెందాడు. ఆయన భౌతికాయంను సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, జడ శ్రీను, మౌలానా, రవీందర్, తదితరులు సందర్శించి సీఐటీయూ జెండా కప్పి ఘన నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడపరాదు

చిన్నగూడూరు: మద్యం సేవించి వాహనాలు నడపరాదని స్థానిక ఎస్సై బాదావత్ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహబూబాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలో పోలీస్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

కొత్తగూడ: పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. నాయకులు శ్రీనివాస్, నవీన్‌నాయక్, మునిందర్, తిరుపతి, రాకేష్, మురళీ, మధు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం గ్రామంలోని మహాగణపతి రాతి విగ్రహ ప్రతిష్ఠ పూజలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులుపాటు నిర్వహించ తలపెట్టిన పూజల్లో వేద పండితులు మొదటిరోజు యాగశాల ప్రవేశం, భూతబలి, విగ్రహశాల ప్రవేశము, అఖండ దీపారాదన గణపతి హోమం, శాలిబలిహారం, మంటప పూజలు లాంటి ప్రత్యేక పూజలు జరిపించారు.

ఆధ్యాత్మిక దైవ క్షేత్రంగా నెలకొల్పుతా..



మరిపెడ రూరల్: మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం శివారు ఆకేరు వాగు ఒడ్డున గంగమ్మ అమ్మవారి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించి గొప్ప ఆధ్యాత్మిక దైవ క్షేత్రంగా నెలకొల్పుతానని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి అన్నారు. పురుషోత్తమాయగూడెం శివారు ఆకేరు వాగు ఒడ్డున యాదవులతో కలిసి గంగమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, నరేందర్‌రెడ్డి, దుర్గయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తొర్రూరు: మాజీ ఎంపీపీ కర్నె సోమయ్యకు పుత్ర వియోగం జరిగింది. ఆయన పెద్ద కుమారుడు, పాలకుర్తి దేవస్థాన డైరెక్టర్ కర్నె రమేష్(56) శుక్రవారం మృతి చెందారు. అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలతో ఇబ్బంది పడుతున్న రమేష్ గురువారం పట్టణ శివారులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆసుపత్రిలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు.

లక్ష్మీపురంలో యువకుడి మృతి

నెల్లికుదురు: చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. తొర్రూర్ ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పులి లక్ష్మణ్ (25) టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో టిప్పర్ ఓనర్ జీతం డబ్బులు సక్రమంగా ఇవ్వక పోవడంతో లక్ష్మణ్ ఇంట్లో గొడవలు జరుతున్నట్లు తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన సతీష్ ఆరు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.